క్లుప్తంగా

తమిళనాడు మార్కెట్ కమిటీ సందర్శన



కమ్మర్‌పల్లి: తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు స్టడీ టూర్‌కు వెళ్లిన కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు బుధవా రం తమిళనాడులో పసుపు మార్కెట్‌గా ప్రసిద్ధి చెందిన సేలం, ఈ రోడ్ మార్కెట్ కమిటీలను సందర్శించారు. ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, పాలకవర్గ సభ్యులు మార్కెట్ కమిటీ కార్యకలాపాలు, మార్కెట్‌ను రైతులు వినియోగించుకునే తీరును అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ ఉత్పత్తులను మద్దతు ధరకు విక్రయించుకోడానికి రెగ్యులేటెడ్ మార్కెట్‌లోకి తీసుకొచ్చి బిడ్డింగ్ చేసుకునే విధానం, గిడ్డంగుల్లో నిల్వ చేసే పద్ధతులను మార్కెట్ కమిటీ సిబ్బంది తెలియజేసినట్లు పాలకవర్గ సభ్యులు తెలిపారు.

శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థలను మూసి వేయాలి

ఆర్మూర్: వరుసగా విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న శ్రీచైతన్య, నారాయణ విద్యా సంస్థలను మూసి వేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సేవలతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో పీడీఎస్‌యూ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు ప్రిన్స్, నాయకులు రాహుల్, రవీందర్, అక్షయ్, ఆకాశ్ న్నారు.

నలందకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు



పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లిలోని నలంద హైస్కూల్ విద్యార్థులు ఐబీటీ మెగా ఒలంపియాడ్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ నలంద ప్రసాద్, ప్రిన్సిపాల్ నలంద సాగర్ బుధవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఈ అభ్యాస్ అకాడమీ వారు నవంబరు నెలలో 4 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులకు ఐబీటీ మెగా ఒలంపియాడ్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో నలంద పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సతీశ్, సందీప్, శ్వేత, నిఖిల, రాజశ్రీలు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

కమ్మర్‌పల్లి: ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల గడువును పొడిగిస్తూ ఓపెన్ స్కూల్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు కమ్మర్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సాయన్న తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి స్పెషల్ అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా ఈనెల 2 నుంచి 11వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. కమ్మర్‌పల్లి ఓపెన్ టెన్త్ సెంటర్ పరిధిలోని అభ్యాసకులు దరఖాస్తు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9000358082 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



రెంజల్: మండలంలోని నీలా హైస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. నిజామాబాద్‌కు చెందిన సూర్య ఆరోగ్య సంస్థ సహకారంతో 365 మందికి పరీక్షలు చేయగా 40 మందికి దృష్టిలోపం ఉన్నట్లు అప్తమాలజిస్ట్ శ్రీకాంత్ గుర్తించారు. కంటి జబ్బులతో బాధపడుతున్న విద్యార్థులకు త్వరలో కంటి అద్దాలు అందిస్తామని సూర్య ఆరోగ్య సంస్థ ముఖ్య కార్యనిర్వాహక అధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఫీల్డ్ కో–ఆర్డినేటర్ వినోద్‌కుమార్, వర్ధ్ సంస్థ ప్రతినిధి రజిత, సమీర్, హెచ్ఎం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అనిల్‌కుమార్‌కు డాక్టరేట్

బోధన్: పట్టణ కేంద్రంలోని బ్రాహ్మణగల్లీకి చెందిన అనిల్‌కుమార్‌కు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జేఎస్ విశ్వ విద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసింది. నవంబర్ 29న ఆ యూనివర్సిటీ ప్రాంగణంలో డాక్టరేట్ పట్టాను అందుకున్నట్లు ఆయన బుధవారం తెలిపారు. ప్రొఫెసర్ కేవీ భాస్కర్‌రావు పర్యవేక్షణలో 'అడ్వాన్స్‌డ్ ఇమేజ్ రికగ్నిషన్ విత్ కన్వొల్యూషన్ న్యూరల్ నెట్‌వర్క్'అనే అంశంపై తాను చేసిన పరిశోధనకు డాక్టరేట్ పట్టా అందించారని పేర్కొన్నారు.

చేతి వృత్తిదారులకు ఉపాధి కరువు

- కుల వృత్తిని నమ్ముకునే జీవనం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



పల్లెల్లో తిరుగుతూ సామగ్రిని విక్రయిస్తున్న వడ్రంగి

బాల్కొండ: ఆదరణ, ఉపాధి కరువై చేతి వృత్తిదారులు రోడ్డున పడుతున్నారు. ప్రస్తుత ఆధునిక యుగంలో అంతా ప్లాస్టిక్‌మయం కావడంతో కర్రతో చేసే వంట సామగ్రికి గిరాకీ లేకుండా పోయింది. దీంతో కుల వృత్తినే నమ్ముకుని జీవనాధారం సాగిస్తున్న వడ్రంగులు రోడ్డున పడ్డారు. కర్రను చెక్కి అందమైన రూపం తెచ్చి మార్కెట్‌లో విక్రయానికి తీసుకెళ్తున్న కార్పెంటర్లకు నిరాశే ఎదురవుతోంది. దీంతో సరైన గిరాకీలు లేక పోవడంతో పల్లెల్లో సైకిల్‌పై తిరుగుతూ జీవనం సాగిస్తున్నారు. ప్రధానంగా చపాతీలు, పూరీలు చేసే పీటలు, పప్పు రుద్దు కర్రలు, గోడలకు కొట్టే స్టాంపులను తయారు చేసి విక్రయిస్తు జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం స్టీలు, ప్లాస్టిక్ ప్యాషన్ కావడంతో వీటి వినియోగం తగ్గింది. దీంతో తాము కష్టపడి తయారు చేసినా ఫలితం లేకుండా పోతోందని కార్పెంటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టిని మలిచి అందమైన రూపంతో కుండలు, కూజాలు తయారు చేసే కుమ్మరి వృత్తి దారులకు కూడా సరైన గిరాకీలు లేక బతుకు భారమవుతూ జీవనాన్ని నెట్టుకొస్తున్నారు. వేసవిలో చల్లని నీటి కోసం కొంత మేర గిరాకీ ఉంటుంది. అవి కూడా ఫ్రిజ్‌లు వచ్చిన తర్వాత లేకుండా పోయిందని కుమ్మరి కుల వృత్తిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం శుభకార్యాలకు, అశుభ కార్యాలయాలకు మాత్రమే కుండలు వినియోగిస్తున్నారు. అందులో కూడా డ శుభ కార్యక్రమాలకు స్టీలు బిందెలతోనే కథ ముగించేవారు కూడా ఉన్నారు. ప్రభుత్వం కొందరి చేతి వృత్తి దారులకు చేయూతనిస్తున్నాయి. కానీ అందరికి అందడం లేదు. దీంతో కుల వృత్తిదారుల మధ్య తారతమ్యాలు ఎక్కువ అవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని చేతి వృత్తిదారులకు చేయూతనిస్తు ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

గిరాకీ లేదు



ప్రతి రోజు ఉదయం సైకిల్‌పై అమ్మడానికి పల్లెలోకి వెళ్తుంటాను. కానీ ఎక్కడా గిరాకీ కావడం లేదు. పప్పు రుద్దుటకు కర్రలు, పీటలు తయార చేస్తూ జీవనం సాగిస్తున్నాను. కానీ ప్లాస్టిక్ వాడుకలోకి రావడంతో ఎవరూ వీటిని కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వం తమను ఆదుకోవాలి.

– గంగాధర్, కార్పెంటర్, వేంపల్లి

వన్యప్రాణులను కాపాడుకోవాలి



కమ్మర్‌పల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



చిన్నాపూర్ అర్బన్ పార్కులో విద్యార్థులతో అటవీశాఖ అధికారులు

మాక్లూర్/ కమ్మర్‌పల్లి: వన్యప్రాణుల సంరక్షణ అందరిపై ఉందని జిల్లా అటవీశాఖ అధికారి వికాస్ మీనా అన్నారు. బుధవారం మండలంలోని చిన్నాపూర్ అర్బన్ పార్కులో అడవి మామిడిపల్లి, చిన్నాపూర్ ప్రభుత్వపాఠశాల విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. వన్యప్రాణుల సంరక్షణ భవిషత్ తరలాకు ఎంతో అవసరమని అన్నారు. కాలానుగుణంగా కొన్ని జంతువులు, పక్షులు అంతరించిపోతున్నాయని పేర్కొన్నారు. ఆర్మూర్ డివిజన్ ఫారెస్టు అధికారి భవాని శంకర్, ఫారెస్టురేంజ్ అధికారి శ్రీనివాస్, డిప్యూటీ రేంజ్ అధికారి అశోక్, సుధాకర్, శ్రీదేవి, రణవీర్, శ్రీనివాస్, ప్రగతి, ప్రసాద్ పాల్గొన్నారు.

అడువులు, వన్యప్రాణులు, వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలో అందరిపై ఉందని కమ్మర్‌పల్లి అటవీ క్షేత్రపరిధి అధికారి బి రవీందర్ నాయక్ అన్నారు. బుధవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా వనదర్శిని కార్యక్రమం నిర్వహించారు. కమ్మర్‌పల్లిలోని శ్రీవిద్యా సాయి హైస్కూల్ విద్యార్థులు అటవీబాట పట్టారు. కమ్మర్‌పల్లి అటవీ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో అటవీ అధికారులు అడవుల సంరక్షణ, పెంపకం, నీటి వనరుల పరిరక్షణ, అటవీ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హై స్కూల్ కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి, కోఆర్డినేటర్ జాన్ సుందర్, ఉపాధ్యాయులు నకుల్, సింపోనియా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలు



పడగల్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



బాల్కొండ మండల నాగాపూర్‌లో..



మెండోరా మండల కేంద్రంలో..

వేల్పూర్/ బాల్కొండ: వేల్పూర్ మండలం పడగల్, మోతె గ్రామాల్లో బుధవారం ప్రజాపాలన విజయోత్సవాలను కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవ సంబురాలను నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. మెండోరా మండల కేంద్రంలో సీఎం చిత్ర పటానికి వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి పాలాభిషేకం చేశారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నియామకం



హర్ష



ఇంతియాజ్



కృష్ణారెడ్డి

వర్ని: కామారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా వర్ని మండలం కూనిపూర్ గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. ఇటీవల నిర్వహించిన యువజన కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలు నేడు విడుదల కాగా వర్ని మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా హర్ష, చందూర్ మండల అధ్యక్షుడిగా సుమన్‌రెడ్డి, మోస్రా మండల అధ్యక్షుడిగా ఇంతియాజ్ ఎన్నికయ్యారు.

రుద్రూర్‌లో..



నితిన్ పటేల్

రుద్రూర్: రుద్రూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాయకూర్ గ్రామానికి చెందిన టి నితిన్ పటేల్ గెలుపొందారు. ఇటీవల యూత్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక కోసం ఆన్‌లైన్ ఓటింగ్ నిర్వహించారు. బుధవారం వెలుబడిన ఫలితాల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన నితిన్ పటేల్‌కు 581 ఓట్లు వచ్చాయి. నితిన్ పటేల్ ఎన్నికపై మండల యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. మండల, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందించారు.

కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా శ్రీనివాస్



సొడ శ్రీనివాస్

వేల్పూర్: మండలంలోని జాన్కంపేట్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా సొడ శ్రీనివాస్ బుధవారం ఎన్నికయ్యారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని శ్రీనివాస్ వెల్లడించారు. తన నియామకానికి కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆధ్యాత్మికం

- ముగిసిన గజ్జెలమ్మ దేవి ఉత్సవాలు



రుద్రూర్: మండలంలోని అంబం(ఆర్)లో రెండు రోజుల పాటు కొనసాగిన గజ్జెలమ్మ దేవి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఆలయం చుట్టూ ప్రదక్షణం చేసి రథాన్ని ఊరేగింపుగా గ్రామంలోని హన్మాన్ ఆలయం వద్దకు తీసుకొచ్చారు. గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. జాతరకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు. ప్రతి ఏడాది ఖరీఫ్ పంట చేతికి వచ్చిన తర్వాత పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తారు. ఉత్సవాల్లో గ్రామ కమిటీ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

- ఘనంగా రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



పెర్కిట్: ఆలూర్ మండల కేంద్రంలో బుధవారం గౌడ సంఘం సభ్యులు రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అభిషేకం, హోమంతో పాటు అన్న దాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు గోపి, మధు, మహేశ్, నరేశ్, అర్జున్, రంజిత్, సురేశ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నవీపేట: మండలంలోని యంచలో ఉన్న శ్రీ జగద్దాత్రి ఆలయ ఆవిష్కరణ వార్షికోత్సవ కరపత్రాలను జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు బుధవారం ఆవిష్కరించారు. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 2 వరకు కొనసాగే ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జగదాత్రి పీఠాధిపతి స్వర్ణ కమల లక్ష్మీమాత, బీఆర్ఎస్ నాయకులు పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్ల చార్జీలు చెల్లించాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండల పరిధిలోని గ్రామాల్లో ఉన్న వ్యవసాయ మోటార్లకు సంబంధించిన కస్టమర్ చార్జీలను చెల్లించాలని విద్యుత్ శాఖ ఏడీఈ అశోక్, ఏఈ రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి ఏడాది డిసెంబర్ నెలలో రూ.360 కట్టాల్సి ఉంటుందని, రైతులు ఈ విషయాన్ని గమనించి స్థానిక లైన్‌మెన్ లేదా ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. మండల పరిధిలో మొత్తం 5,500 పైగా వ్యవసాయ బోర్లు ఉన్నాయని పేర్కొన్నారు.

బస్సుల సంఖ్యను పెంచాలి

ఆర్మూర్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిన మూడు వేల బస్సులను పునరుద్దరించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యాదర్శి రమేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో అధికారులకు సీపీఐఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ముత్తన్న, కిషన్, రాజేశ్వర్, నరేందర్, నజీర్, శీను, రవి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



ఎడపల్లి: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, షీటీమ్స్‌పై బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్లకు వచ్చే లింకులతో పాటు వివిధ యాప్‌లను ఓపెన్ చేయొద్దన్నారు. విద్యార్థినులతో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే షీ టీమ్స్, స్థానిక పోలీసులకు, డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగశంకర్, నిజామాబాద్ షీ టీమ్ ఇన్‌చార్జి స్రవంతి, ఎస్సై వంశీచందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బాధితులకు అండగా ఉంటా



బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో అగ్నిప్రమాదానికి గురైన ఇంటి బాధితులకు అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి అన్నారు. బుధవారం అగ్ని ప్రమాదానికి గురైన ఇంటిని పరిశీలించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు రూ. పది వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తాన్నాని అన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఎత్తొండలో మొరం తవ్వకాలు

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తొండ శివారులో అనుమతి లేకుండా విచ్చలవిడిగా మొరం అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయి. మొరం తవ్వకాల గూర్చి ప్రశ్నిస్తే అక్రమార్కులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు రాత్రి వేళ నిఘా పెట్టి అక్రమార్కుల దౌర్జన్యానికి అడ్డు వేయాలని కోరుతున్నారు.

అక్బర్‌నగర్‌లో రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న స్థానికులు

రుద్రూర్: మండలంలోని అక్బరనగర్‌లో నీటి స మస్యను పరిష్కరించాలని స్థానికులు బుధ వారం ప్రధాన రహ దారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. సమస్యను పరిష్కరించని కార్యదర్శి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. వారం రోజులుగా సమస్యను అధికారులకు విన్నవించినా నిమ్మకు నిరేత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వారిని సముదాయించారు. మండల అధికారులు రావాలని పట్టుబట్టడంతో జీపీ ప్రత్యేకాధికారి సంతోష్ రెడ్డి, ఎంపీడీవో సురేశ్‌బాబు గ్రామానికి వచ్చారు. యుద్ధ ప్రాతిపదికన స మస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో స్థానికులు ఆందోళన విరమించారు.

నాణ్యమైన విద్యుత్తు సరఫరా లక్ష్యం



జాడి జమాల్‌పూర్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



విద్యార్థి తండ్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్: నాణ్యమైన విద్యుత్తు సరఫరాను అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వ లక్ష్యమని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం సాలూర మండలంలోని జాడిజమాల్‌పూర్ గ్రామంలో, పట్టణంలోని ఆచన్‌పల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడా సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసిన దాఖలు లేవన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే సబ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం అవసరం మేరకు జిల్లా కేంద్రంలో న్యాల్‌కల్, పులాంగ్ రోడ్డులో విద్యుత్ సబ్ స్టేషన్లు, బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో సబ్ స్టేషన్, సాలూర మండలంలోని జాడిజమాల్‌పూర్, సాలూర క్యాంప్ రైతుల అవసరం మేరకు సబ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బోధన్ పట్టణంలో విద్యుత్ వాఖ డీఈ కార్యాలయం కోసం 800 గజాల స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులు, వినియోగాదారులు విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అనంతరం బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ తండాలో సంతు సేవాలాల్, రామారావు విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరై పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ విఠల్, ట్రాన్స్‌కో డీఈ ఎండీ ముక్తార్, ఏడీఈ తోట రాజశేఖర్, ఏడీఈ నాగేశ్, ఏఈలు కృష్ణ, కల్యాణ్, నాయకులు, అధికారులు ఉన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం

బోధన్‌టౌన్: కాకతీయ విద్యాసంస్థలో మృతి చెందిన విద్యార్థి మృతిపై తల్లిదండ్రులు అధైర్య పడొద్దని అండగా ఉంటామని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం మృతి చెందిన విద్యార్థి జస్విత్‌రెడ్డి ఇంటికి వెళ్లి తండ్రి భాస్కర్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. విద్యార్థి మృతికి కారణమైన విద్యాసంస్థపై కేసునమోదయ్యేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే అన్నారు. విద్యార్థి పోస్టుమార్టం జాగ్రత్తగా జరిగేలా చూడాలని విద్యార్థి తండ్రి ఎమ్మెల్యేను కోరారు.

ప్రయాణికులను క్షేమంగా గమ్యానికి చేర్చాలి



ఆర్ఎంకు స్వాగతం పలుకుతున్న డిపో మేనేజర్ రవికుమార్

ఆర్మూర్‌టౌన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులను గమ్యస్థానాలకు క్షేమంగా చేర్చాలని ఆర్టీసీ జిల్లా రీజినల్ మేనేజర్ జ్యోత్స్న అన్నారు. ఆర్మూర్ ఆర్టీసీ డిపోను బుధవారం సందర్శించారు. ఆర్టీసీ ఉద్యోగులు డిపోను మరింత అభివృద్ధి చేయాలన్నారు. అన్ని విధాలుగా కార్మికులకు అండగా ఉంటానని అన్నారు. ఆర్టీసీ డిపో ఆదాయం పెంచడానికి కృషిచేయాలన్నారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. మొదటి సారిగా ఆర్మూర్ డిపోకు వచ్చిన ఆర్ఎంను డిపో మేనేజర్ రవికుమార్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం సరస్వతి, శంకర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మికుల వినతి



హైదరాబాద్‌లోని కార్యాలయం వద్ద కార్మిక సంఘాల నాయకులు

బోధన్: నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్(ఎన్డీఎస్ఎల్) బోధన్, ముత్యంపేట (జగిత్యాల), ముంబోజిపల్లి(మెదక్) ఫ్యాక్టరీలకు చెందిన కార్మిక సంఘాల నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్మిక శాఖ కార్యాలయానికి వెళ్లారు. ఏసీఎల్ అధికారి గంగాధర్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించేందుకు వెళ్లగా అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు. మంగళవారం ప్రజాభవన్‌లో ప్రత్యేక ఐఏఎస్ అధికారిణి దివ్యను కలిసి తమ సమస్యలు విన్నవించగా సదరు అధికారిణి సూచన మేరకు కార్మిక శాఖ కార్యాలయానికి వెళ్లినట్లు నాయకులు తెలిపారు. ఫ్యాక్టరీ లేఆఫ్ కాలం నాటి నుంచి రావాల్సిన బకాయి వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు వివరించారు. ఏసీఎల్‌ను ఫోన్‌లో సంప్రదించగా, త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి సమాచారం ఇస్తానని హామీ ఇచ్చారని నాయకులు వెల్లడించారు. నాయకులు ఉపేందర్, నరహరి, ఎం రాజయ్య, ఈ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలి



రుద్రూర్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ. 15వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7న ఆటో యూనియన్ జేఏసీ తలపెట్టిన ఆటోలు బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని చౌరస్తాలో ఆటో కార్మికులతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. మహాలక్ష్మి పథకంతో ద్వారా మహిళలకు ఉచిత బస్సు ద్వారా నష్టపోయిన ఆటో డ్రైవర్లను ఆదుకోవాలన్నారు. ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు ఖలీం, ఫక్రు, అంజయ్య, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	పుష్ప-2(తెలుగు)-5.40 9.45 1.50 5.55 10.00
స్క్రీన్-2 –	పుష్ప-2(తెలుగు)-2.05 6.10 10.15 2.20 6.25 10.30
స్కీన్-3 –	పుష్ప-2(తెలుగు)-1.20 5.25 9.30 1.35 5.40 9.45
స్కీన్-4 –	పుష్ప-2(తెలుగు)-1.50 5.55 10.00 2.05 6.10 10.15

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-9.45 1.45 5.50 9.50
స్క్రీన్-3	పుష్ప-2(తెలుగు)-6.00 10.00 2.00 6.05 10.05

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-2.05 6.10 10.15 2.20 6.25 10.30
స్క్రీన్-2	పుష్ప-2(తెలుగు)-1.20 5.25 9.30 1.35 5.40 9.45
స్క్రీన్-3	పుష్ప-2(తెలుగు)-1.50 5.55 10.00 2.05 6.10 10.15
స్క్రీన్ -4	పుష్ప-2(తెలుగు)-1.35 5.40 9.45 1.50 5.55 10.00
లలితామహల్	పుష్ప-2(తెలుగు)
దేవి	పుష్ప-2(తెలుగు)
నటరాజ్	పుష్ప-2 (హిందీ)
విజయ్	పుష్ప-2 (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	77,300	వెండి(కిలో)	94,000
22 క్యారెట్స్	71,317		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800